## భక్తుల పెన్నిధి..
# గుబ్బల మంగమ్మ సన్నిధి

- కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి
- ఆహ్లాదభరితం.. ఆలయ పరిసర ప్రాంతం
- ప్రకృతి సోయగాలు.. జాలువారే జలపాతాలు
- అటవీప్రాంతంలో అబ్బురపరుస్తున్న పర్యాటక కేంద్రం
- పూజారులుగా గోగులపూడి కొండరెడ్లు


ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

అశ్వారావుపేట, డిసెంబర్ 13 : తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు పూర్తిగా అటవీప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందింది. ఆలయంపై జాలువారే జలపాతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. ప్రకృతి సోయగాల మధ్య పచ్చని వాతావరణం భక్తులకు పారవశ్యంతోపాటు ఆహ్లాదానిస్తున్నది. అమ్మవారి సేవలో కొండరెడ్ల గిరిజనులు పూజలు చేయడమే కాకుండా భక్తులకు సేవలు అందిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా స్వయంభువుగా వెలిసిన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం పర్యాటక కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతున్నది. ప్రతిఏటా లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం సరిహద్దులోని దట్టమైన అటవీప్రాంతంలో గుబ్బల మంగమ్మ తల్లి శతాబ్దాల క్రితం స్వయంభుగా వెలిసి భక్తులకు దర్శనమిస్తున్నది. కోర్కెలు తీర్చే ఆరాధ్యదైవంగా భక్తులకు నిత్యం అమ్మవారు దర్శనమిస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. నిత్యం దర్శనమిచ్చే అమ్మవారికి ప్రతి ఆదివారం, బుధవారం రోజు భక్తులు అధికసంఖ్యలో మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తారు.

### రాష్ట్ర విభజనతో ఆంధ్రాకు..

గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం రాష్ట్ర విభజనకు ముందు పూర్తిగా తెలంగాణ ప్రాంతానికి చెంది ఉంది. అశ్వారావుపేట మండలానికి చెందిన గిరిజనుల ఆధీనంలో పూజలు అందేవి. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వివాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం దేవాదాయశాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకుంది. సరిహద్దు వివాదం తీవ్రస్థాయికి చేరడంతో భద్రాచలం ఐటీడీఏ, ఏలూరు జిల్లా కన్నాపురం ఐటీడీఏ అధికారులు సమాలోచనల తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించబడింది. అప్పటినుంచి జంగారెడ్డిగూడెం దేవాదాయశాఖ ఆలయ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నది.

### ఐటీడీఏ ద్వారా గిరిజనులకు దుకాణాలు ఏర్పాటు

దట్టమైన అటవీప్రాంతంలో ఆలయం ఉండడం వల్ల గిరిజనులే పర్యవేక్షిస్తున్నారు. పలు విజ్ఞప్తుల అనంతరం ఐటీఏడీ అధికారులు అటవీశాఖతో సమన్వయం చేసుకుని గిరిజనులకు ఉపాధి కల్పించే విధంగా దుకాణాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు, సరుకులు అందుబాటులోకి వచ్చాయి. దుకాణాలు ఏర్పాటుతో గిరిజనులకు ఆర్థికభరోసా కలిగింది. కొన్ని దుకాణాలను భద్రాచలం ఐటీడీఏ ఏర్పాటు చేయగా మరికొన్ని దుకాణాలను కన్నాపురం ఐటీడీఏ అధికారులు ఆ ప్రాంత గిరిజనుల కోసం నిర్మించింది. దీంతో ఇరుప్రాంతాల గిరిజనులకు ఉపాధి అవకాశాలు లభించాయి.



### కొండరెడ్లే పూజారులు

గుబ్బల మంగమ్మ ఆలయ సమీపంలోని గోగులపూడి గ్రామానికి చెందిన కొండరెడ్లే పూజారులు అమ్మవారికి సేవలు అందిస్తున్నారు. వారి ఆధ్వర్యంలోనే భక్తులకు పూజలు అందుతాయి. అమ్మవారి ఆలయాన్ని ఎండోమెంట్‌శాఖ స్వాధీనం చేసుకుంది. కొండరెడ్లకు దేవాదాయశాఖ వేతనాలు చెల్లిస్తుంది. వీరి భక్తులకు ప్రతిరోజు అందుబాటులో ఉంటారు. ఆదివారం, బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఈ రోజుల్లో భారీగా ఆలయానికి తరలివస్తారు.

### ఆకర్షణీయంగా ప్రకృతి అందాలు

దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ ఆలయం అంతా ప్రకృతి అందాలతో భక్తులను ఆకర్షిస్తున్నది. ఆలయంలోకి ప్రవేశించేందుకు సుమారు 5 కిలోమీటర్ల ముందే అటవీ మార్గం ప్రారంభమవుతుంది. పచ్చని ప్రకృతి అందాలు భక్తులకు స్వాగతం పలుకుతాయి. మట్టి రోడ్డు గుండా ఆలయం వద్దకు భక్తులు చేరుకుంటారు. భారీ వృక్షాలు, పక్షుల కిలకిలలు, పెద్ద రాళ్లు, ఎత్తైన కొండలు, కాలిబాట పక్కనే పారే వాగు, ప్రశాంతమైన వాతావరణం భక్తులను కనువిందు చేస్తాయి. వేసవికాలంతోపాటు ఏడాది పొడవునా ఆలయంపై జాలువారే జలపాతం భక్తులు, పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నది. జలపాతం నుంచి వచ్చే శబ్దాలు సంగీతంలా భక్తులు ఆస్వాదిస్తుంటారు. జాలువారే జలపాతం కిందే భక్తులు స్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయంపై పారే జలపాతం ఎక్కడ నుంచి వస్తుందో నేటికీ అంతుపట్టని రహస్యం.


గుబ్బల మంగమ్మ ఆలయ ప్రవేశ ద్వారం

### పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

తెలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం పర్యాటక కేంద్రంగానూ దినదినాభివృద్ధి చెందుతున్నది. ఈ ఆలయం పచ్చని ప్రకృతి అందాలతో భక్తులకు దర్శనమిస్తున్నది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ అధికారులు అటవీశాఖ సహకారం కూడా తీసుకుంటున్నారు. మౌళిక సదుపాయాలతోపాటు ఆలయ దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ అధికారులు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నారు.

---

- భద్రాద్రి జిల్లాలో 60 పాల సేకరణ కేంద్రాలు
- ప్రతిరోజు 3 వేల లీటర్ల మిల్క్ సేకరణ
- 10 వేల మంది పాడి రైతులకు లబ్ధి
- వారిని ప్రోత్సహించేందుకు పథకాలు అమలు



## స్వచ్ఛతకు మారుపేరు
# విజయ డెయిరీ

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతిఒక్కరూ రోజుకు 200 మి.లీ పాలైనా తాగాలని సైంటిస్టులు, న్యూట్రిషనిస్టులు సూచిస్తుంటారు. మనం తాగే పాలన్నీ మంచివా..? స్వచ్ఛమైనవా..? అంటే కానే కాదు. కానీ 'మా సంస్థ నుంచి బహిరంగ మార్కెట్‌లోకి వచ్చే పాలు స్వచ్ఛమైనవి..' అని ఘంటాపథంగా చెప్తున్నారు లక్ష్మీదేవిపల్లి పరిధిలోని విజయ డెయిరీ నిర్వాహకులు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఈ డెయిరీ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా వందలాది మంది పాడి రైతులు, సిబ్బంది ఉపాధి పొందుతున్నారు.


లక్ష్మీదేవిపల్లిలో పాలు సేకరించే కేంద్రం

### పాడిరైతులకు ప్రోత్సాహం..

గ్రామాల్లో నివసించే వారిలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారు. ఆ తర్వాతి స్థానం పాడి పరిశ్రమది. పాడి రైతులను ప్రోత్సహించేందుకు విజయ డెయిరీ యాజమాన్యం ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తున్నది. 2019 వరకు 193 మంది రైతులకు రాయితీపై గేదెలు, ఆవులు అందించింది. ప్రైవేటు డెయిరీలకు దీటుగా మార్కెట్‌లో నిలదొక్కుకునేందుకు సరికొత్త పథకాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం పాడి రైతుకు ఒక లీటర్‌కు రూ.4 చొప్పున ప్రోత్సాహకం ఇస్తున్నది.

### ప్రతిరోజు 5 వేల లీటర్ల పాల సేకరణ..

డెయిరీ పరిధిలో జిల్లా కేంద్రంతో పాటు ఇల్లెందు, కొత్తగూడెం డివిజన్ల పరిధిలో 60 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడి సిబ్బంది పాడి రైతుల నుంచి సుమారు 3 వేల లీటర్ల పాలు సేకరిస్తారు. స్థానికంగా కొన్ని లీటర్లు విక్రయిస్తాయి. మరికొన్ని లీటర్లను ఆటోల ద్వారా మిల్క్‌సెంటర్లకు తరలిస్తారు. ప్రస్తుతం డెయిరీ పరిధిలో ఒక లీటర్ పాల ధర రూ.80 ఉన్నది. యాజమాన్యం పాడి రైతులకు అదనంగా మరో రూ.2 ఇస్తుంది. అలాగే నాలుగు శాతం ప్రోత్సహకాలనూ అందిస్తుంది.


పాలసీతలీకరణ చేస్తున్న సిబ్బంది

### పథకాలు ఇలా..

పాడి రైతులు పశువులు కొనుగోలు చేసేందుకు డెయిరీ యాజమాన్యం రూ.వెయ్యి రాయితీ ఇస్తున్నది. జీవాల బీమాకు రూ.వెయ్యి, కృత్రిమ గర్భాధారణ సదుపాయం. అధిక శాతం ఎస్ఎస్ఎఫ్ కలిగిన పాలకు ప్రీమియం ధర కల్పిస్తున్నది. పాడి రైతుల ఇంట పెండ్లి జరిగితే ఆ వేడుకకు యాజమాన్యం 'విజయ పెండ్లి కానుక' పథకం ద్వారా రూ.5 వేలను కానుకగా ఇస్తున్నది. బల్క్ మిల్క్ సెంటర్లలో నాణ్యమైన ఎక్కువ పాలు పోసే పాడిరైతులకు రూ.2,116 నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నది. 1,500 లీటర్లు అంతకన్నా ఎక్కువ పాలు పోసే రైతులకు రాయితీపై గడ్డి కత్తిరించే యంత్రాలు, పాల క్యాన్లు, విద్యుత్, దాణా, మినరల్ మిక్చర్ పంపిణీ చేస్తున్నది. ల్యాబ్‌లో రిజిస్టర్ అయిన రైతులకు మాత్రమే బీమా సౌకర్యం ఉంటుంది. ఏ కారణంతోనైనా పాడి రైతు మృతిచెందితే డెయిరీ యాజమాన్యం అంతిమ సంస్కారాలకు రూ. 5 వేల సాయం అందిస్తుంది.


వెన్నశాతాన్ని పరీక్ష చేస్తున్న విజయడైరీ సిబ్బంది

### ఈ గ్రామాల్లో ఎక్కువ..

పాలకు రోజు రోజుకు డిమాండ్ పెరగడంతో ఎక్కువ మంది జీవాలను పెంచుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లా పరిధిలోని ఎంపీ బంజర, రెడ్డిపాలెం, లక్ష్మీపురం, సుజాతనగర్, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి డెయిరీ యాజమాన్యం ఎక్కువగా పాలను సేకరిస్తున్నది. అత్యధికంగా ఎంపీ బంజర నుంచి ఓ పాడి రైతు 500 లీటర్ల పాలను కేంద్రానికి తరలిస్తున్నారు. పశుపోషణ కోసం కొందరు పాడి రైతులు పిల్లిపెసర, జనుము వంటి పంటలనూ పండిస్తున్నారు.



### డెయిరీతో లాభదాయకం..

పాడి రైతులు పశువుల నుంచి తీసిన పాలను స్థానికులు కొనకపోయినా డెయిరీ యాజమాన్యం పాలను తీసుకుంటుంది. యాజమాన్యం మంచి ధర కూడా ఇస్తున్నది. ఉదయం ఎనిమిది గంటల కల్లా కేంద్రానికి తీసుకువస్తే వెంటనే పరీక్ష చేసి తీసుకుంటున్నారు.

**– కాపురి బ్రహ్మేశ్వరరావు, పాడి రైతు, చింతోనిచిలక, టేకులపల్లి మండలం**



### స్వచ్ఛమైన పాలు అందిస్తున్నది..

మా సంస్థ నుంచి ప్రజలకు స్వచ్ఛమైన పాలు అందిస్తున్నాం. పాలను నిల్వ చేసేందుకు మేము ఎలాంటి రసాయనాలను వినియోగించడం లేదు. మా డెయిరీ పాలు కేవలం ఒకరోజు మాత్ర మే నిల్వ ఉంటాయి. ఇతర కంపెనీల పాలు అలా కాదు. పాల ఉత్పత్తులు మరింత పెంచేందుకు గ్రామస్థాయిలో మరిన్ని సేకరణ కేంద్రాలు పెడుతున్నాం. మాకు కొత్తగూడెం, ఇల్లెందు డివిజన్ల పరిధిలో ఎక్కువ సేకరణ కేంద్రాలు ఉన్నాయి.

**– కుమారస్వామి, విజయ డెయిరీ డీడీ, లక్ష్మీదేవిపల్లి**

---

## 'భద్రాచలం' సమగ్రాభివృద్ధే ధ్యేయం
### ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, డిసెంబర్ 13: నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలోని ఓ ప్రైవేటు స్థలంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీపీఐలో కొనసాగుతున్న రావులపల్లి రాంప్రసాద్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ చేరి తన గెలుపు కోసం శ్రమించారన్నారు. అలాగే దుమ్ముగూడెం మండలానికి చెందిన పార్టీ నాయకులు ఊరూరా ప్రచారం నిర్వహించి తనను గెలిపించారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు సునీల్, అన్నెం సత్యాలు, నోముల రామిరెడ్డి, బత్తుల నరసింహులు, ఖాసీం, దొడ్డిపట్ల శివప్రసాద్, విశ్వనాథం, రాము, శ్రీను, అందుర్తి సతీష్, మారెడ్డి గణేష్, కొలిపాక శివ పాల్గొన్నారు.

---

వైకుంఠ ఏకాదశి

- తొలిరోజు మత్స్యావతారంలో భద్రాద్రి రామయ్య
- నేడు కూర్మావతారం

# అధ్యయనోత్సవాలకు శ్రీకారం


మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రాద్రి రామయ్య

భద్రాచలం, డిసెంబర్ 13 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలకు బుధవారం అర్చకులు, ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. తొలిరోజు భద్రాద్రి రామయ్య మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రాకార మండపంలో నిత్య కల్యాణమూర్తులు, ఉత్సవమూర్తులకు(స్వర్ణ మూర్తులు) అభిషేకం, తిరుమంజనం జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను అంతరాలయంలోకి తీసుకెళ్లి, నిత్య కల్యాణమూర్తులను మత్స్యావతారంలో అలంకరించారు. మాధ్యాహ్నిక ఆరాధన జరిపారు. ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, వేదఘోషలతో బేడా మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన ఆరాధన, కర్మణ పుణ్యాహవాచన జరిపించారు. అధ్యయనోత్సవాలను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి చతుర్వేద పారాయణం, రామాయణ పారాయణం చేసే ఆచార్య, బ్రహ్మ, ఋత్విక్‌లకు ఈవో దీక్షావస్త్రాలు సమర్పించారు. అనంతరం స్థానాచార్యులు కేఈ స్థలశాయి నేతృత్వంలో నాళాయిర దివ్య ప్రబంధంలోని 200 పాశురాలను గంటసేపు పఠించారు. ముందుగా ఆళ్వార్‌కు పరివట్టం కట్టి మెడలో దండవేసి చేతిలో తులసి, చక్కెర ప్రసాదాన్ని ఉంచారు. ఉత్సవమూర్తులు, నిత్య కల్యాణమూర్తులను అంతరాలయంలో ఉంచి మహానైవేద్యం, రాజభోగం సమర్పించారు. మధ్యాహ్నం 2:30 గంటలకు మత్స్యావతారంలో ఉన్న స్వామివారిని గోదావరి తీరానికి తీసుకెళ్లి హారతులు సమర్పించారు. తర్వాత మిథిలా స్టేడియంలోని వేదిక వద్దకు కోలాటం, నృత్యాలు, వేదఘోషలతో తోడ్కొని వచ్చారు. మత్స్యావతారంలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు మిథిలా స్టేడియానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి తిరువీధి సేవలో విశ్రాంత మండపం వద్ద కాసేపు ఉంచారు. అనంతరం తాతగుడి సెంటర్ వద్దకు తీసుకొచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్య గురువారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


రామయ్యను దర్శించుకుంటున్న భక్తులు


రామయ్యను పల్లకిలో తీసుకువస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

### పర్ణశాలలో..


తిరువీధి సేవలో పాల్గొన్న ఆలయ అధికారులు

పర్ణశాల, డిసెంబర్ 13: భద్రాచలం రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల ఆలయ సన్నిధిలో బుధవారం వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు రామయ్య మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు తిరువీధి సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు శ్రావణ్‌కుమార్, అనీల్, పర్ణశాల ఆలయ సూపరింటెండెంట కిశోర్ పర్యవేక్షించారు.